క్లుప్తంగా

పాఠశాలల్లో ముందస్తు రాఖీ వేడుకలు


కమలాపూర్ : రాఖీ కట్టిన విద్యార్థినులకు నోట్‌బుక్స్ అందజేసిన ఎస్సై మధు

కమలాపూర్ : మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం ప్రముఖులకు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు రాఖీలు కట్టారు. తమకు రాఖీలు కట్టిన చిన్నారులకు స్థానిక ఎస్సై అనంతగిరి మధు నోట్‌బుక్స్, పెన్నులు అందించారు. శిశు మందిర్ ఉపాధ్యాయురాలు స్వరూపరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల బిట్స్‌లో..



పరకాల : పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం రాఖీ వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. బిట్స్, చైతన్య మోడల్ హైటెక్ పాఠశాలలో విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. బిట్స్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ యుగేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

దుగ్గొండి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ అరుంధతి కోరారు. మండలంలోని నాచినపల్లి, పొనకల్, లక్ష్మీపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆమె సందర్శించి పరిశీలించారు. గ్రామాల వారీగా మంజూరైన ఇళ్ల సంఖ్య, అందులో నిర్మాణం ప్రారంభం అయినవి.. ఇంకా మొదలు కానివి.. తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. దశలవారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ముక్కెర ఆనంద్, కవిత, కొండల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు నూటెంకి జయ, బుగ్గ అయిలయ్య పాల్గొన్నారు.

అటవీ జంతువులతో జాగ్రత్తగా ఉండాలి

నల్లబెల్లి : అటవీ జంతువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (ఎఫ్‌బీఓ) కిరణ్, సతీశ్, శోభన్ రైతులకు సూచించారు. మండలంలోని కొండాపురం శివారులోని గణేశ్‌నగర్‌లో రైతు కోటికి చెందిన ఎద్దుపై గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసిందన్న ప్రచారం జోరందుకున్న సందర్భంగా అటవీ శాఖ సిబ్బందితో కలిసి వారు గ్రామాన్ని సందర్శించి బాధిత రైతుతో మాట్లాడారు. అడవి జంతువుకు సంబంధించిన పాదముద్రలు, ఇతర ఆనవాళ్ల కోసం విచారణ చేశారు. ఎద్దుపై దాడి చేసింది హైనా కావొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. అడవి జంతువుల సంచారాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

నర్సంపేట : విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని మండల ప్రత్యేక అధికారి ఆకాంక్షించారు. చెన్నారావుపేట కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయలోని వంట గది, స్టాఫ్ రూమ్, డైనింగ్ హాల్‌తోపాటు భవన పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు చెప్పారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాయపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గట్టికల్‌లో కారుపోతుల పిచ్చమ్మ, సుధాకర్‌లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం ఆయన భూమిపూజ చేయించి మాట్లాడారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇంటి లబ్ధి చేకూరేలా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?


గొల్లపల్లి బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


వైకుంఠధామానికి వెళ్లే దారిలో స్తంభం నుంచి తెగిపోయిన విద్యుత్ తీగ

- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- చేతికందేలా ట్రాన్స్‌ఫార్మర్లు
- చోద్యం చూస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

నడికూడ : విద్యుత్ షాక్‌తో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా మండల కేంద్రంలోని గొల్లపల్లి రోడ్డుడ్యాంపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే బ్రిడ్జికి సమానంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. విద్యుత్ తీగలు బ్రిడ్జికి దగ్గరగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జిపై నుంచి సులువుగా చిన్న పిల్లలకు సైతం అందేవిధంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రంలోని వైకుంఠధామానికి వెళ్లే దారికి అడ్డుగా విద్యుత్ తీగ కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉందని అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే బస్టాండ్ బిలకంటివాడలో గల ఇనుప విద్యుత్ స్తంభం నుంచి విద్యుత్ తీగ తెగిపోయి కొన్ని రోజులుగా వేలాడుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారుకానీ సరిచేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు, తదితరులు కోరుతున్నారు.


బిలకంటి వాడలో స్తంభం నుంచి తెగిపోయి వేలాడుతున్న విద్యుత్ తీగ

ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలి

- ఈస్ట్ జోన్ డీసీపీ షక్వార్

శాయంపేట : ప్రజలు, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ షక్వార్ పోలీస్ అధికారులను, సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, పాత రికార్డులను, ఎఫ్ఐఆర్‌లను పరిశీలించి కేసు నమోదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఫిర్యాదు స్వీకరించి ఫిర్యాదుదారుడికి రిసిప్ట్ ఇవ్వాలని, కేసు నమోదు చేయాలని సూచించారు. వెంటనే దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, సీఐ రంజిత్‌రావు, ఎస్సై పరమేశ్, సిబ్బంది ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్‌షక్వార్

సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీలు


సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీలతో నాయకులు

శాయంపేట : మండలంలోని 100 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు బీఆర్టీయూ నుంచి శుక్రవారం సీఐటీయూలోకి చేరినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వీరగోని నిర్మల వెల్లడించారు. వారు మాట్లాడుతూ విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు ఇవ్వాలని, విద్యా వాలంటీర్లకు అందించే వేతనాన్ని అదనంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అందించాలని డిమాండ్ చేశారు. ఆరేళ్లలోపు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలోకి పంపించేందుకు అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఐసీడీఎస్‌కు సంబంధంలేని బీఎల్‌ఓ విధులను, అదనపు పనులను మినహాయించాలని అన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించతలపెట్టిన కలెక్టరేట్ల ఎదుట ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జ్యోత్స్న, సామల కవిత, వంగల రజిత, కొత్త స్వప్న, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషిచేయాలి


సభ్యత్వం అందజేస్తున్న రమేశ్

వేలేరు : ఉపాధ్యాయులు, మేధావులు, నిపుణులు, యువత, విద్యార్థులు శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక ఉమ్మడి ధర్మసాగర్ మండల అధ్యక్షుడు రమేశ్ కోరారు. శుక్రవారం మండలంలోని గురుకుల పాఠశాల, ధర్మసాగర్ ప్రభుత్వ పాఠశాల, ఇతర పాఠశాలల్లో జేవీవీ సభ్యత్వాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సైన్స్, టెక్నాలజీ దూసుకెళ్తున్న తరుణంలో ప్రజలు మాత్రం మూఢ నమ్మకాలను విశ్వసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూఢ నమ్మకాలు విశ్వసించకుండా శాస్త్రీయంగా ఆలోచించాలని, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సైన్స్‌పై చైతన్యపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సభ్యులు శ్రీనివాస్, సుదర్శన్, శ్రీహరి, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానించిన మంద కృష్ణ



ధర్మసాగర్ : రాష్ట్రస్థాయి మిడ్‌రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రభుదేవ్‌ను పద్మశ్రీ మంద కృష్ణమాదిగ శుక్రవారం సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుడు గంగారపు శ్రీనివాస్ కుమారుడు ప్రభుదేవ్ ఇటీవల హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన సౌత్ జోన్ తెలంగాణ స్టేట్ మీట్ అండర్–16 విభాగంలో 1000 మీటర్ల రిలే పరుగుపందెంలో మొదటి స్థానం సాధించాడు. విషయం తెలుసుకున్న మంద కృష్ణ గురువారం సాయంత్రం చింతగట్టులో జరిగిన సభలో ప్రభుదేవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

వైభవంగా పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన


ప్రతిష్ఠించిన విగ్రహాలు

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపురం గ్రామంలో శుక్రవారం నూతన పోచమ్మతల్లి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. పెద్దాపురం, లింగమడుగుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దేవుని పూజల్లో ప్రముఖులు


పెద్దేవుని పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు


సన్మానించుకుంటున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు: మండలంలోని నందనం గ్రామంలో ప్రతియేటా పెద్దేవుని పూజల్లో భాగంగా సామూహిక వనభోజన కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు నిర్వహిస్తారు. శుక్రవారం గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు పలువురు బీసీ సంఘం రాష్ట్ర నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రముఖులు కోరుకున్నారు. ఈక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎదురెదురు పడడంతో చిరునవ్వుతో ఇరువురు పలుకరించుకుని ఒకరికొకరు శాలువా కప్పుకుని సన్మానించుకున్నారు. కాగా మల్లికార్జునస్వామిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దర్శించుకున్నారు. రాంనగర్, నందనం ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు


దామెర : సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు


శాయంపేట : మత్స్యగిరిస్వామి ఆలయంలో ..

దామెర : శ్రావణమాసం పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో వరలక్ష్మీ వ్రతం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దెత్తున ఆలయానికి చేరుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజుశర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధూపదీప, నైవేద్యాలు, టెంకాయలు సమర్పించారు. మండలంలోని ఊరుగొండ శివనాగేంద్ర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ నిర్వాహకులు భక్తులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి ఆలయం, శివమార్కండేయ, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, మార్త రాజ్‌కుమార్ వైభవంగా జరిపించారు. గణపతి పూజ, మహాలక్ష్మీ దేవి అష్టోత్తరాలు, కలశారాధన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయంలో గల మహాలక్ష్మి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని పురువీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అడ్వొకేట్ విజయపాల్‌రెడ్డి, ప్రతాప్‌సేనారెడ్డి, భగవాన్‌రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్లు భిక్షపతి, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. మహిళలు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ దేవికి పూజలు నిర్వహించి ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి


మహేష్ (ఫైల్)

కమలాపూర్ : పరకాల ఆర్డీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కమలాపూర్ మండలంలోని గూడూరుకు చెందిన కొండపాక మహేష్ (34) గురువారం సాయంత్రం గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన మహేష్‌కు సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు మహేష్‌ను హుటాహుటిన కమలాపూర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పరకాల ఆర్డీఓ నారాయణ శుక్రవారం సిబ్బందితో కలిసి మహేష్ మృతిపై సంతాపం తెలిపారు. అనంతరం మహేష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని మాందారిపేటలో గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని గ్రౌండ్‌ఫ్లోర్ కొంతభాగం ధ్వంసం కాగా మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలోని వంటగది, వంట సామగ్రి, కూరగాయలు, డైనింగ్‌హాల్‌ను, పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. వసతి గృహంలో ఫ్యాన్లు లేవని, కిటికీలకు దోమలనెట్‌లు, బెడ్స్ లేవని, కోతుల బెడద ఎక్కువగా ఉందని, పాడైపోయిన అరటిపండ్లు ఇస్తున్నారని, టాయిలెట్స్ సరిగాలేవని, మెనూ ప్రకారం కోడిగుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థినులు ఎమ్మెల్యేకు తెలిపారు. నాణ్యమైన అరటిపండ్లు, కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన రాఖీలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కట్టారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, రవి, మార్కండేయ, కృష్ణమూర్తి, రవిపాల్, రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు శ్రీహరికి చెంపపెట్టు

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : సుప్రీంకోర్టు తీర్పు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి చెంపపెట్టని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. మండలంలోని కేశవనగర్, క్యాతంపల్లి, జానకీపురం, తాటికాయల, రాయినీగూడెం, కాశగూడెం గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఊరూరికీ బీఆర్‌ఎస్ సంక్షేమాలు, ఇంటింటికీ కేసీఆర్ పథకాలు కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని అన్నారు. ప్రతి గ్రామంలో రహదారులు, తాగునీటి సదుపాయం, విద్యుత్, పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా, వైద్య సేవలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యపడిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నీతి, నిజాయితీ ఉంటే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ సోమిరెడ్డి, నాయకులు ప్రభుదాస్, లాల్‌మహ్మద్, శ్రీను, రవీందర్, రాజు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనం రూపురేఖలు మారుస్తాం


పిచ్చిమొక్కలను తొలగించిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పరకాల : మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పరకాల పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గల ప్రకృతి వనం పశువులకు అడ్డాగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 5వ తేదీన సాక్షి దినపత్రికలో 'పశువులకు అడ్డాగా ప్రకృతి వనం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ కమిషనర్ సుష్మ స్పందించారు. పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్న పట్టణ ప్రకృతి వనాన్ని సిబ్బందితో శుభ్రం చేయించడంతో పాటు వన మహోత్సవంలో భాగంగా కొత్తగా మొక్కలు నాటించారు. అదే విధంగా ప్రకృతి వనం పట్టణ ప్రజలను ఆకట్టుకునే విధంగా మారుస్తామని చెప్పారు.

పొంగిన వాగు.. రాకపోకలకు బ్రేక్


కంఠాత్మకూరు వంతనపై నుంచి ప్రవహిస్తున్న వరద ఉధృతి

నడికూడ : గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని కంఠాత్మకూరు వాగు శుక్రవారం సాయంత్రం వరకు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పరకాల నుంచి వయా అంబాల–హనుమకొండకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరకాల, అంబాల, హనుమకొండ బస్సులు వయా నడికూడ, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి, అంబాల మీదుగా వెళ్లాల్సి వచ్చింది. వరద ఉధృతి కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా బారికేడ్లు ఏర్పాటుచేసి ఉన్నతాధికారులు సమాచారం అందించినట్లు కారోబార్ రమేశ్ తెలిపారు.

హర్‌ఘర్ తిరంగాను జయప్రదం చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

శాయంపేట : బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 12వ తేదీల వరకు చేపట్టనున్న హర్‌ఘర్ తిరంగ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేసి ప్రజల్లో జాతీయ పతాకంపై గౌరవం కల్పించి, దేశభక్తిని బలోపేతం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మండల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు దేవరాజ్, సుమన్, చంద్రమౌళి, సుధాకర్ పాల్గొన్నారు.

లయన్స్‌విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పొలిటికల్ జేఏసీ కమిటీ, లయన్స్‌విజన్ క్లబ్, మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెడికవర్ వైద్యుడు ఫణిచంద్ర 106 మందికి బీపీ, షుగర్, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటిపరీక్షలు నిర్వహించి పొరలు వచ్చినవారికి హైదరాబాద్‌లోని పుష్పగిరి ఆస్పత్రిలో ఉచిత ఆపరేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఓ గంగాజమున, వెటర్నరీ డాక్టర్ సునీల్, ఏఈఓ అర్చన, తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ సభ్యులు అజిత్‌కుమార్, గణేశ్, ప్రజ్వల్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.